క్లుప్తంగా

ప్రతిఒక్కరూ చదువుకోవాలి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పురుషోత్తం

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. మండలంలోని చందారం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అక్షరాస్యత కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామంలో వయోజన విద్య ద్వారా చాలా మంది విద్యావంతులయ్యారని, 100 రోజుల్లో వంద శాతం ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు 13మంది విద్యావలంటీర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కూరగాయల వ్యాపారులతో సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ శ్వేత హాజరయ్యారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం పూర్తైయ్యాక లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్ సురేష్, కూరగాయల విక్రయదారుల అసోషియేషన్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం'

బెల్లంపల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులు, విద్యార్థులు, జర్నలిస్టులపై భౌతిక దాడులు చేస్తున్నారని, ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. మార్పు రావాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్‌ని గెలిపిస్తే, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, రమేష్, సతీష్, సురేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ మహాధర్నా



ధర్నాలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవదిక దీక్ష శుక్రవారం ముగిసింది . ఈ సందర్భంగా నాయకులు జీఎం ఆఫీస్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్ నాయకులు మల్లేష్, లింగయ్య, శ్రీనివాస్, అక్బర్ అలీ, రాజీవం, మనోహర్ నర్సయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

తాండూర్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాండూర్ మండల ప్రత్యేక అధికారి గజానంద్ సూచించారు. తాండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఇన్ఫెక్షన్ లు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. ఆరోగ్య సిబ్బంది , ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ,గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాలో గోరింటాకు వేడుక



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని దండేపల్లి కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మొక్కల నుంచి తీసుకొచ్చిన గోరింటాకులను మెత్తగా గ్రైండ్ చేసి, ఎర్రబడేందుకు అందులో నిమ్మకాయ, చింతపండును కలిపి, చేతులకు, పాదాలకు పెట్టుకున్నారు. అంతకు ముందు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

\- దండేపల్లి

చేనులా మారిన క్రీడాప్రాంగణం



భీమిని: గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం పెంచేందుకు గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దాంపూర్ గ్రామంలోనూ క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసింది. అందులో క్రీడా సామగ్రి కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ క్రీడా మైదానాన్ని గ్రామానికి చెందిన రైతులు చేనులా మార్చేశారు. సుమారు 20 గుంటల స్థలంలో రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రైతు ల ఇలా ఆక్రమించేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ యువకులు కోరుతున్నారు.

బల్దియా బండ్లకు నిర్లక్ష్యపు తుప్పు



మరమ్మతులకు నోచుకోని వాహనాలు



తుప్పు పట్టిపోతున్న ట్రాక్టర్ ట్రాలీలు



మూలనపడ్డ చెత్త ఆటో ట్రాలీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు అనతి కాలంలోనే మూలకు పడుతున్నాయి. మరమ్మతులకు వచ్చిన వాహనాలకు సత్వరంగా రిపేరు చేయించడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటోంది. అడపాదడపా మరమ్మతులు చేయించినా, సత్వరంగానే మళ్లీ రిపేరుకు వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ కారణంగా ఎంతో విలువైన వాహనాలు వినియోగించడానికి వీలు లేకుండా తయారవుతున్నాయి. దీంతో పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏళ్ల తరబడి నుంచి వానకు తడిసి, ఎండకు ఎండి తుప్పు పడుతున్నాయి. ప్రధానంగా బ్లేడ్ ట్రాక్టర్, చెత్త తరలించే ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు ట్యాంకర్లు తదితర రకాల వాహనాలు స్క్రాప్‌గా మారుతున్నాయి. ఆ తీరుగా ప్రజా ధనం వృథా అవుతున్నా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు వీసమెత్తు కూడా శ్రద్ధ లేకుండా పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లిస్తున్న ధనాన్ని దుబారా చేయడం ఎంతవరకు సమంజసమని పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తరలింపుతో మెరుగు'బడి'ంది..!

- చేరువైన సర్కారు స్కూల్.. క్యూకట్టిన స్టూడెంట్స్
- ఏడుగురి నుంచి 49కి చేరిన విద్యార్థుల సంఖ్య



విద్యార్థులతో కళకళలాడుతున్న స్టేషన్‌రోడ్ పాఠశాల తరగతి గది

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడి విద్యార్థులకు దూరంగా ఉండటంతో ప్రవేశాలు అంతంతకు పడిపోయింది. విద్యార్థుల సంఖ్య పదిలోపు పడిపోవటంతో బడి నిలబడుతుందా.. మూసివేస్తారా అనే పరిస్థితి నుంచి 50కి చేరువగా విద్యార్థుల సంఖ్య పెరగటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. స్థానిక హరిజన వాడ పాఠశాల భవనంలో మూడు పాఠశాలలు విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో 'సార్' బడి తరలించరూ అనే శీర్షికతో పాటు పలుమార్లు 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో స్టేషన్‌రోడ్ పాఠశాలను స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి తరలించారు. జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య చొరవ తీసుకుని('సాక్షి' కథనంకు స్పదించి) గత నెల 9న బడిని తరలించారు. గడిచిన సంవత్సరం హరిజన పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పాఠశాలలు, ఐదు తరగతులకు గాను హరిజన వాడ స్కూల్‌లో 30, రాళ్లపేట్ రోడ్‌లో-14, స్టేషన్‌రోడ్ స్కూల్‌లో 07 విద్యార్థులు సంఖ్యతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మూడు స్కూళ్ల పేరిట మొత్తం 51 మంది విద్యార్థులు లేకపోవటంతో సర్కారు బడుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం పాఠశాల అందుబాటులో ఏర్పాటు చేయటంతో ఈ ఏడాది హరిజన వాడ -38, రాళ్లపేట్ పాఠశాలలో-17 అంటే 55 మంది ఉంటే ఒక్క స్టేషన్‌రోడ్ పాఠశాలలో 49మంది ప్రవేశాలు పొందారు.

అదనపు తరగతి గదులున్నా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాయ్స్ హైస్కూల్ ఆవరణలో తరగతి గదులు నిర్మించారు. విద్యార్థుల సంఖ్య లేకపోవటం.. జిల్లాల పునరువిభజనతో ఒక భవనంలో కింద నాలుగు గదులు డీఈవో కార్యాలయం, పైన రెండుగదులను జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి కేటాయించారు. మరో వైపు నిర్మించిన భవనంలో జిల్లా సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పైన ఉన్న గదుల్లో స్పోర్ట్స్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డీఈవో కార్యాలయం, స్పోర్ట్స్ అధికారి కార్యాలయం ఇక్కడి నుంచి తరలించారు. డీఈవో కార్యాలయంలో ఎంఈవో, భవిత, డీసీఈబీ కార్యాలయం ఏర్పాటు చేయగా మరో గది ఖాళీగానే ఉంటుంది. సైన్స్ సెంటర్‌పైన స్పోర్ట్స్ అధికారి కార్యాలయం తరలిపోయిన (కలెక్టర్ కార్యాలయంకు) ఏదో సామగ్రి ఉందనే నెపంతో పాఠశాల గదుల్లోనే తిష్టవేశారు. పాఠశాల అవసరాలకు నిర్మించిన ఆ భవనాలు ఖాళీ చేసి స్టేషన్ రోడ్ బడికి అప్పగించాలని పలువురు కోరుతున్నారు. ప్రత్యేక పాఠశాల భవనంతో పాటు మౌలిక వసతుల కల్పనతో మరింతగా విద్యార్థులు బడిబాట పట్టే అవకాశాలు లేకపోలేదు. విద్యాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రాళ్లపేట్ బడిని తరలించేదెన్నడో..

హరిజన వాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన మరో పాఠశాల రాళ్లపేట్‌ను తరలించాలనే డిమాండ్ అంతంతకు పెరుగుతుంది. రెండు పాఠశాలలు ఒకే చోట ఉండటంతో అడ్మిషన్ల సంఖ్య పెరగకుండా పోతుందనే అభిప్రాయాలున్నాయి. విద్యార్థులకు అందుబాటులో రాళ్లపేట్‌లోనే పాఠశాల ఏర్పాటు చేస్తే అడ్మిషన్లు పెరుగుతుందనేదానికి స్టేషన్‌రోడ్ పాఠశాల తరలింపు.. పెరిగిన అడ్మిషన్లు ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అధికారులు రాళ్లపేట్ బడిని తరలించి బతికించాలని కోరుతున్నారు.

రెండు గదులు, మరో టీచర్ అవసరం

బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టేషన్‌రోడ్ స్కూల్‌లో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు పెరిగిన అడ్మిషన్లతో మరో తరగతి అవసరం ఉంది. రైల్వేస్టేషన్‌రోడ్ సమీపంలోని పప్పుగుత్తి వాడకు చెందిన విద్యార్థులే ఎక్కువగా ప్రవేశాలు పొందారు. ఇదివరకు సమీపంలో సర్కారు బడిలేకపోవటంతో దూరంగా ఉన్నా హమాలీవాడకు వెళ్లాల్సి రావటంతో బడికి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ సారి బడి దగ్గరకు (చేరువ) కావటంతో పిల్లలు బడిబాట పట్టారు. వీరిలో ఎక్కువగా హిందీ పిల్లలు కావటంతో తెలుగు వారితో బోధించటం కష్టంగా మారుతుంది. రెండు తరగతి గదులు, మరో టీచరును కేటాయిస్తే విద్యార్థుల బోధనకు సులువుగా మారనుంది.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ కుమార్‌దీపక్ సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్సెట్టిపేట: రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని పనుల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోతపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకోవాలని, మంచి మార్కులు సాధించాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. గదులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో సరోజ, ఎంపీవో అజ్మత్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామపంచాయతీలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ కలిసి ప్రారంభించారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ తోట ప్రవంతి, అశోక్, ఎంపీడీవో భూమన్న, రేంజర్ రవి, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థలం కోసం ఎంపీకి వినతి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలికల జూనియర్ కళాశాలకు పక్కా భవనం నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని మంజూరు చేయించాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.రమాదేవి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను కోరారు. ఎంపీ శుక్రవారం మందమర్రికి రాగా ప్రిన్సిపాల్ వినతి పత్రం అందజేశారు. ఎంపీ వంశీకృష్ణ సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జైపూర్: మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త తాటపల్లి శ్రీనివాస్ కొడుకు హరీశ్ గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా జైపూర్‌లో వారి నివాసానికి వెళ్లి హరీశ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్రై డేను డ్రైడేగా ప్రతి ఒక్కరూ నిర్వర్తించాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 7, 15వ వార్డుల్లో ఆయన శుక్రవారం పర్యటించి, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బదావత్ ప్రకాశ్, శ్రీరాముల సుజాత, టీఎంసి చంద్రయ్య, సీవోలు సరోజ, అరుణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. మున్సిపాలిటీలోని 23, 27వార్డుల్లో శుక్రవారం డ్రైడేను పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సెలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, చైర్మన్ సురమిల్ల వేణు అన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణ పరిధిలోని పదో వార్డులో పలు కాలనీలలో, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శీపతి సుమతి, ఆర్ఓ సతీష్, ఆర్ఐ తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భీమారం: వ్యాధులు ప్రబలకుండా దోమల వ్యాప్తిని ప్రతి ఒక్కరూ నిరోధించాలని ఎంపీడీవో రాధారాథోడ్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఆమె శుక్రవారం పర్యటించి డ్రై డే పాటించారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువును కబ్జా నుంచి విడిపించాలి



నిరసన తెలుపుతున్న దళిత రైతులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి శివారు సర్వే నం.19లోని చెరువును కబ్జా కోరల్లో నుంచి విడిపించి తమకు న్యాయం చేయాలని శుక్రవారం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువును ఆధారంగా చేసుకొని జీవిస్తున్న రైతు కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, ఇందులో దళిత రైతు కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ముత్యంపల్లికి చెందిన నర్సింగరావు అనే వ్యక్తి చెరువు నాదే అంటూ తూమును, మత్తడిని తవ్వించి నీటిని బయటకు వదిలి చెరువును సాగు చేస్తున్నట్లు ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీగఢ్‌పూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 13వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గఢ్‌పూర్, బాబానగర్, దుబ్బగూడెం, చిన్నగోపాల్‌పూర్, పెద్ద గోపాల్‌పూర్, ముత్రిగూడెం, నాగారం గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

లక్సెట్టిపేట: ఈ నెల 13వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకు లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెన్నూర్: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెన్నూర్ పట్టణంతో పాటు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి పరిధిలోని అందుగులపేట సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 12గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మల్లేషం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాసిపేట: మండలంలోని కొండపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేస్తున్నందునా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీపరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిస్కం బెల్లంపల్లి పట్టణ ఏఈ బొంకూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బజారు ఏరియా పరిధిలోని రోడ్ నంబర్ 2, 3, 4 కన్నాల బస్తీ, పోస్టాఫీసు బస్తీ, ఫుల్ బాల్ గ్రౌండ్‌బస్తీ, పెద్దనపల్లి, కాల్‌టెక్స్, గాంధీ నగర్, గంగారాం నగర్, టేకుల బస్తీ ఏరియాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు బాగు చేయించుకున్న రైతులు

దండేపల్లి: మండలంలోని అందుగులపేట నుంచి నర్సాపూర్ పొలాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. సమీప పొలాల రైతులు శుక్రవారం సొంత ఖర్చులతో ట్రాక్టర్లతో మొరం పోయించుకుని, రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేశారు.

'ఆపరేషన్ ముస్కాన్'లో విద్యార్థి గుర్తింపు

జన్నారం: మండలంలో 'ఆపరేషన్ ముస్కాన్' కింద పాఠశాలకు వెళ్లకుండా బడి మానేసిన పిల్లాడిని బడిలో చేర్పించారు. ఎస్సై రామయ్య వివరాల ప్రకారం... జన్నారం మండలం పుట్టిగూడ గ్రామానికి చెందిన మాదాడి అజయ్ అనే బాలుడు ఏడో తరగతి వరకు చదివి బడి మానేసి పని చేసుకుంటున్నాడనే సమాచారం మేరకు శుక్రవారం అక్కడికి వెళ్లి బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.

మహిళల రక్షణకే షీ టీమ్

వేమనపల్లి: మహిళల సంరక్షణ, సైబర్ నేరాలను అరికట్టేందుకే షీ టీమ్స్ పని చేస్తున్నాయని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, షీ టీమ్ ఎస్సై హైమావతితో కలిసి నీల్వాయి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, ర్యాగింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వాహనాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

లక్సెట్టిపేట: వాహన యజమానులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సీఐ నరేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వీకర్స్‌కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో మాట్లాడారు. కాలనీలో పలు ఇళ్లలో తిరిగి ధ్రువీకరణ లేని పత్రాలను పరిశీలించి అదుపులోకి తీసుకున్నారు. ధ్రువీకరణ లేని ముప్పై బైకులు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

నెన్నెల: రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ సూచించారు. మండలంలోని కుశ్నపల్లి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

ఐటీ ఫైలింగ్ యాజమాన్యమే చేయించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలు కంపెనే చేయించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డెప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కోటపల్లి: వర్షాకాలంలో తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ఎసన్వాయిలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

'కాంట్రాక్ట్ పనులకు ఇబ్బంది కలిగించొద్దు'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో తాము చేసే సివిల్ కాంట్రాక్ట్ పనులకు ఇబ్బంది కలిగించవద్దని గోదావరిఖనికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కాంట్రాక్టర్లు యస్ సతీశ్‌కుమార్, కే సతీశ్, నరేందర్ మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో 15ఏళ్లుగా తాము కాంట్రాక్ట్ పనులు చేస్తూ ఇక్కడి అసోసియేషన్‌తో కలిసి పని చేశామన్నారు.

కస్తూరిబాలో వనమహోత్సవం

నెన్నెల: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత, కస్తూరిబా టీచర్లు పద్మ, కల్యాణి, తిరుమల, విద్యార్థినులు పాల్గొన్నారు.